# బాలసదనం

''ఇంటికి పోదాం!'' ముద్దు ముద్దు మాటలతో అన్నాడు బుజ్జి. కొంత సేపు విని విననట్టు ఊరుకున్నా ఈమారు ఆత్రంగా సుమతి వంక చూశాడు విరించి. అతనికి చిన్న చిరుచెమట పడుతోంది.

సుమతి గంభీరంగా అటూ ఇటూ చూస్తోంది.

ఆటో చాలా జోరుగా ముందుకుపోతోంది. అమ్మా, నాన్నా మధ్య కూర్చున్న బుజ్జిగాడు మాత్రం భయం భయంగా అమ్మ వంకే చూస్తున్నాడు.

''నాన్నా ! ఇంటికి పోదాం !'' మరోసారి అన్నాడు.

సుమతి వాడిని దగ్గరకు తీసుకుని ఒళ్లో కూచో పెట్టుకుంది.

''రజని చెప్పిన ప్రాంతం ఇదే... తాజ్‌మహల్ హోటల్ ప్రాంతంలో ఎవరినడిగినా చెబుతారంది''

''ముందు హోటల్ రానీ !'' విరించి ముందుకు చూస్తూ అన్నాడు.

''అక్కడ....''

'' ఎన్నిసార్లు చెబుతావ్. ఎవరో ఒకాయన పిల్లలందరినీ కన్నతల్లిని మరిపించేసేటంతటి ప్రేమతో, గారంతో ఆ బాలసదనంలో పెంచుతున్నాడని – దేనికీ లోటు లేకుండా తల్లిదండ్రులను మరపించే మమత పంచుతున్నాడనీ. అందరికీ అందుబాటులో ఉండేటట్లు ధనాపేక్ష లేకుండా సేవాదృష్టితో సదనాన్ని నిర్వహిస్తునట్టు చెబుతూనే ఉన్నావ్... చూడు సుమతీ!... నీ మనసు నువ్వు గట్టిపరచుకోవడం కోసం అతన్నీ, సదనాన్నీ పొగుడుతున్నావ్. బాగానే ఉంది. తీరా ఓ వారం రోజుల్లో నా బిడ్డ అంటూ పరిగెత్తి వస్తావ్.... ఆయన మంచితనం గురించి విన్నట్టే నేను ఆయన పద్ధతుల గురించీ విన్నాను. ముందు అనుమతి తీసుకుని మాత్రం నెలకి ఒకే ఒక్క గంట పిల్లవాడిని చూడడానికి తల్లీ, తండ్రీ కలిసే రావాలట – ఆ నిబంధన నువ్ పాటించగలవా అన్నదే నా సందేహం...''

ఆటో ఆగింది.

'' ఇక్కడ తెలుసుకోండి !'' అని ఆటో అబ్బాయి తన భాషలో చెప్పి డబ్బులు పుచ్చుకుని రివ్వున వెళ్లిపోయాడు.

మహానగరం గడబిడ ఆ ప్రాంతంలో అట్టే లేదు. పరిసరాలు, పరిస్థితులు బహు ప్రశాంతంగా ఉన్నాయి. చుట్టు పక్కల అక్కడ అక్కడా తప్ప ఎక్కువ ఇళ్లు లేవు. జనసమ్మర్ధం ఉండే నగరానికి ఎన్నో మైళ్ల దూరం వచ్చేసినట్టనిపించి విరించి గుండెనిండా గాలి పీల్చుకున్నాడు. ' ఇంటికి పోదాం' అని ఆటో ఎక్కినది మొదలు పాడుతున్న పాటను ఆపేసి తండ్రి చిటికెన వేలుని పట్టుకుని బుజ్జి ఉత్సాహంగా నడుస్తున్నాడు.

'అన్నపూర్ణ బాలసదన్' అన్న బోర్డు కుడిచేతి పక్క విశాలమైన వీధి ముందు ఓ బాణం గుర్తుతో ఓ కరెంటు స్థంభంపై కనబడింది. ఎవరినీ అడగనక్కర లేకుండానే దోవ తెలిసినందుకు ధైర్యం వచ్చింది దంపతులకి.

బాలసదన్ రెండంతస్తుల మేడలో వుంది. మేడ ముందు విశాలమైన కాంపౌండు అందులో పెద్ద తోట – బయట రోడ్డు మీద నుంచి చూస్తే లోపల మేడ కనబడకుండా పెద్ద చెట్లతో ఒక తోటలా

కనపడింది.

వరండా మీద సుమారు ఓ సంవత్సరం వయస్సున్న పిల్లవాడికి వాకర్‌తో ఒకాయన నడక నేర్పుతున్నడు. మరో ఐదేళ్ల కుర్రాడు చేతిలో పలక బలపం పట్టుకుని చిన్నవాడు వాకర్‌తో ఆడుకోవడం వింతగా చూస్తున్నాడు.

''చాచా!'' అంటూ ఓ పాప వచ్చి ''నే చేసిన బొమ్మ'' అంటూ ఓ బొమ్మను అందించింది ముసలాయనకు.

మరో బాబు ''నాకు ఈ లెక్క చెప్పరూ !'' అంటూ వచ్చాడు. ముసలాయన వంక చూస్తూ అలా ఉండిపోయాడు విరించి.

వాతావరణం ప్రశాంతంగా ఉంది. ఆడవాళ్లు అటు ఇటూ వెళుతూ ఆగి పిల్లల వంక ఓమారు చూస్తున్నారు సంతోషంగా.

సుమతి బుజ్జిని కిందకి దింపి చొరవగా అడిగింది ముసలాయనను ఆంగ్లంలో –

''క్షమించండి.... నేను.... మేము.... బాలసదన్ డైరక్టర్‌ను చూద్దామని వచ్చాం.... వారితో మేం వచ్చినట్టు దయచేసి చెబుతారా ?''

''తప్పకుండానమ్మా– తమరు దయచేసి ఈ గదిలో కూచోండి'' అంటూ ఓ గదివంక చూపించి వాకర్ సాయంతో నడుస్తున్న చిన్నారిని ఎత్తుకుని లోపలకు నడిచాడు.

లోపల అందంగా అమర్చబడిన గది. గది మధ్య టేబులు. టేబిల్ దగ్గర కుర్చీలు. గోడవారంట రెండు సోఫాలు. ఎక్కడ కూచోడమూ అని ఓ క్షణం చూసి టేబిల్ దగ్గర కుర్చీలో కూచుంది సుమతి.

బుజ్జి టేబిల్ మీద బొమ్మల వంక ఆత్రంగా చూస్తున్నాడు. విరించి సోఫా దగ్గరగా వెళ్లి ఏదో ఫోటో వంక తదేకంగా చూడడాన్ని సుమతి గమనించింది.

''నువ్వేమీ అనుకోకపోతే నువ్వే ఆయనతో మాటాడు. నాకు మాటాడటం బొత్తిగా రాదు !'' అన్నాడు.

''సరే ! అది నాకు మరీ ఇష్టం !'' అంది. ఆమె కళ్లలో ఓ రకమైన గర్వం జిగ్గున మెరిసింది.

''క్షమించాలి. పిల్లల్ని ఆయాలకు అప్పచెప్పి రావడం ఆలస్యమైంది. గోడవంక ఫోటోని మైమరచి చూస్తున్న విరించి ఆయనవంక తేరిపార చూశాడు.

ఆయన వచ్చి టేబిల్ చుట్టూ తిరిగి అవతలి కుర్చీలో కూర్చున్నారు.

'' ఆయన పేరు... విరించి'' సుమతి ప్రారంభించింది.

''నాకు తెలుసు ! మీ పేరు సుమతి ! అవునా ?'' ముసలాయన గొంతులో ఆర్ద్రత తొణికిసలాడింది.

''అంటే నాకు తెలియకుండా మీరు వీరికి ఉత్తరం రాశారన్న మాట !'' సుమతి ఆశ్చర్యంతో భర్తతో అంది.

విరించి మొహం ఎర్రగా అయింది. అతను సమాధానం చెప్పలేదు.

''వివరాలు మీకు ముందే నా భర్త రాయడం విషయాన్ని మీ ముందుంచడానికి జాప్యం లేకుండా ఉపకరించింది. ఇద్దరం ఉద్యోగస్తులం.... ఇద్దరం ఇంజనీర్లమే మా పెద్దల ప్రమేయం లేకుండా జరిగింది. ఈ బిడ్డకి ఇప్పుడు నాలుగో సంవత్సరం. మా వాళ్ల దగ్గరకునే వెళ్లలేని పరిస్థితి... నా భర్తకూ నా అనేవాళ్లు లేరు. ఇద్దరం ఉద్యోగాల మీద బయటికి వెళ్లిపోవాల్సినవాళ్లం. మా సమస్య

తీర్చడానికి – బిడ్డకి ఆలనా, పాలనా, ముద్దు, ముచ్చటా తీరుస్తూ – సత్ప్రవర్తన – మంచి శిక్షణ, చదువూ ఇచ్చే బాలసదనం ఇదే అని కొంత మంది చెప్పగా విన్నాం.... మీరు...''

''మీ వారి అభిప్రాయం...''

విరించి వంక చూసింది సుమతి. అతను తలదించుకున్నాడు.

''విరించీ ! ఆయన ఏదో అడుగుతున్నారు !'' అంటూ అతని వంక తేరిపార చూసింది.

విరించి కంటిలో నీళ్లు –

''చూడండి !'' ముసలాయన ప్రారంభించాడు.

'' ఈ బిడ్డని వదలటానికి ఆయనసిద్ధంగా ఉన్నట్టు లేరు... తల్లిదండ్రుల మధ్య పొరపొచ్చాలుంటే బిడ్డలు ఆనందంగా పెరగటానికి అవరోధం ఏర్పడుతుంది. మీరు తీరికగా, నిదానంగా ఆలోచించుకుని రావచ్చు. బాలసదన్ ఎక్కడికీ వెళ్లిపోదు. ఓ వారం ఆలోచించుకుని మళ్లీ రండి...'' అంటూ డ్రాయర్‌లో నుంచి ఓ డబ్బా తీసి అందులోని బిస్కెట్ తీసి బుజ్జికి ఇచ్చాడు ముసలాయన. అతకుముందే ఎదురుగా కూచున్నావిడతో మాట్లాడుతూనే పిల్లవాడు తదేకంగా చూస్తున్న బల్లమీద బొమ్మ వాడి చేతిలో ఉంచాడు ముసలాయన.

''నా దగ్గరకు వస్తావా?'' అన్నట్టు చేతులు చాచాడు. పిల్లవాడు ఆయన ఒడిలోకి వెళ్లిపోవడం చూసి సుమతి ఆశ్చర్యపోయింది. భర్త వంక తిరిగింది. అతని కళ్లల్లో నీళ్లు !

విరించి మళ్లీ ఆ ఫోటో వద్దకు వెళ్లి నిలబడ్డాడు. ఆ ఫోటో వంక చూసింది సుమతి. నుదుటన పెద్ద బొట్టుతో నడివయసులోని ఎవరో ఓ స్త్రీ.

కనీ కనిపించని చిరునవ్వుతో ముసలాయన ఒడిలోని పిల్లవాడి వంక గోముగా చూస్తూ పరధ్యానంగా ఉండిపోయాడు.

''మీకు నెలకు ఎంత ఇవ్వాలి ?'' ఆమె అడిగింది ఇంగ్లీషులోనే.

''సుమతీ!'' విరించి అంత బిగ్గరగా పిలవడంతో ఆమె గిరుక్కున అతని వంక తిరిగి చూసి ఆగిపోయింది.

'' ఆగు ! ఎవరితో మాట్లాడుతున్నావో తెలుసా– ఆయన మా నాన్నగారు !'' ఆమెకు తెలిసే భాషలో చెప్పాడు విరించి.

తండ్రి దగ్గరగా వెళ్లి–

''నాన్నగారూ, క్షమించమని అడగడానికి కూడా నోరు రాని స్థితిలో ఉన్న నన్ను చూసి జాలిపడండి. మీరు ఇన్నాళ్ల తరువాత ఇలా కనబడతారని అనుకోలేదు.... అమ్మ తోడుగా చెబుతున్నాను... మీరు మా పెళ్లికి ఒప్పుకుంటారనుకోలేదు. మీ మడి, ఆచారం... మీ నమ్మకాలు మీకు చెప్పి కలిగించిన కష్టమే ఎక్కువనుకున్నాను. అమ్మ ఎలానూ లేదు....''

విరించిలో అంత ఆవేశం, తండ్రి ఎడల అంత అభిమానం ఉంటుందని సుమతి కనీసం ఊహించలేదు. తన తల్లికీ, తండ్రికీ తను చేరువవుదామన్నా ఆ అవకాశం ఆమెకు వచ్చే అవకాశమే లేదు. వారిద్దరూ తను ఇంటర్ చదివే రోజుల్లోనే దైవసాయుజ్యాన్ని పొందారు. క్రైస్తవుల కుటుంబంలో పుట్టినా ఆమె పేరు సుమతి కావడం వెనక ఓ ఆంతర్యముంది. రెండు తరాల కిందట సుమతి అమ్మమ్మ గారి తల్లి క్రైస్తవ మతం పుచ్చుకుంది. ఆమె పేరు సుమతి. ఆమె జ్ఞాపకార్థం సుమతి తల్లి

తన కూతురుకి సుమతి పేరు పెట్టుకుంది.

సుమతికి ఎందుకో తన తండ్రిని చూసిన అనుభూతే కలిగింది. వెళ్లి ఆయన పాదాలను తాకి నమస్కరించింది.

''మీ బిడ్డను మీ వద్దనుండి వేరు చేశానని అనుకోవడం సహజం. కాని నేనెన్నిసార్లు అడిగినా అడ్రసయినా చెప్పలేదు నా భర్త. మీరు నన్ను క్షమించండి – మీరు ఆయన్ను కని, పెంచి, పెద్ద చేశారు – కనీసం ఆయన మీకు కనపడినపుడు పలకరించకుండా ఎలా ఉండగలిగారు ?'' ఆవేశంగా అడిగింది ఆమె.

ఆమె భుజం మీద చెయ్యి వేసి, అలా మాట్లాడటం తగదన్నట్లు వారించాడు విరించి.

ముసలాయన ముఖం మీద చిరునవ్వు అలానే ఉంది.

''చూడమ్మా – ఎన్నాళ్ల తరువాతో, ఎన్నేళ్ళ తరువాతో తను అన్యాయానికి గురైన తండ్రి కొడుకు పలకరించే వరకూ ఆగగలగడం నిగ్రహానికి నిదర్శనం అనుకుని వాడు నేనెవరో నీకు చెప్పేవరకూ ఆగడానికి నాకూ కష్టమైంది.... వరండాలోనే వాణ్ని చూశాను. అప్పుడే కౌగలించుకోబోయి నిగ్రహించుకున్నాను. నా ఎదుటికి వచ్చిన కొడుకు ఇక పోడన్న నిబ్బరంతో... ఇంతకీ వాడు నన్ను తండ్రిగా నీకు చెబుతాడో లేదోనన్న సందేహంతో నాలో నేనే ఆలోచించుకుంటున్నాను... క్షమ ఎంత గొప్పదో మీ మతమూ నీకు చెప్పే ఉంటుంది.''

''అయ్యా ! .... నాకు మీ భాష రాదు. మమ్మల్ని క్షమించండి. మీరు ఇలా ఎక్కడో ఉండే బదులు మాతోనే, మీ బిడ్డ దగ్గరే ఉండడం...'' సుమతి ఉద్వేగంతో అంది.

'' ఆగు తల్లీ ఆగు ! నీ బిడ్డనే నువ్ చూసుకోలేక నా దగ్గర ఉంచాలని వచ్చావ్..... నేను నీ దగ్గరకు వచ్చి నీకు బరువు కాలేను. వీడి తల్లి వీడు పుట్టాక వీణ్ణి చూసే ఆసరా లేక చేస్తున్న లెక్చరర్ ఉద్యోగం మానేసింది. మాది చాలా ఆలస్యంగా జరిగిన వివాహం – ఆ రోజుల్లో ఈ సదుపాయాల్లేవు – ఆమె పోయి వీడు కూడా నాకు దూరమయ్యాక – ఉద్యోగ బాధ్యతలతో సతమతమయ్యే తల్లిదండ్రుల బిడ్డల సంరక్షణను నేను ఉన్న ఊరికి ఇంత దూరం వచ్చి మహానగరంలో ఈ బాలసదనాన్ని నిర్వహిస్తూ వస్తున్నది కేవలం ఊసుపోకకనే కాదు – డబ్బు సంపాదించాలనీ కాదు. నా ఆస్తి తినడానికీ అనుభవించడానికీ ఎవరూ లేరని తెలిశాక దాన్ని కరిగించి ఇక్కడ ఈ ఇల్లు కొన్నాను. నాకు ఇప్పుడు ముప్ఫై ఇద్దరు మనవలు – ఇరవై ఇద్దరు కొడుకులు. ఇరవై ఇద్దరు కోడళ్లూ – నలభై నలుగురు పిల్లలు. ఎవరి బిడ్డను తెచ్చి నాకు ఒప్పగించినా – వాళ్లు వచ్చి తీసుకువెళ్లేవరకు నే చూసుకుంటాను. దైవ కృప అంటే అదే – ఏ తల్లిదండ్రులూ నా దగర బిడ్డని ఓ సంవత్సరమూ రెండేళ్ల కంటె ఎక్కువ ఉంచడం లేదు – అదే నా తృప్తి.

వారంతా ఓ విధంగా ఈ బాలసదనంలో వాళ్లు దూరంగా ఉండీ నేర్చుకుని జీవన గమ్యాల్ని అవగాహన చేసుకున్నవాళ్లే. నా కొడుకూ ఈ బాలసదన్‌కి వచ్చాడు. అదే నేర్చుకున్నాడు. నాకదే చాలు !

రా ! బాబూ, రా...'' అంటూ ముసలాయన బుజ్జిని లోపలకు తీసుకుపోయాడు.

విరించి మళ్లీ గోడమీద ఫోటో దగ్గరకి వెళ్లాడు.

''మీ అమ్మగారా ?''

''అమ్మ నా కోసం ఉద్యోగం మానేసింది. నాన్న మానేయవద్దనే బ్రతిమాలాడాడట అమ్మ చెబుతూ ఉండేది. నే కాలేజీలో చదువుతున్నా నాకు ఇంకా గోరుముద్దలు పెడుతున్న జ్ఞాపకాలే ఆమె మనసులో మెదులుతూ ఉండేవి...''

''మీ నాన్నగారిని మనతో తీసుకువెళ్లలేం – మనం ఇక్కడ ఉండిపోతే?''

'' ఆయన్నడుగు ! కోపం లేకపోవడం ఆయన గొప్ప ప్రత్యేక లక్షణం !''

విరించి సోఫాలో కూలబడ్డాడు.

లోపల నుంచి ఓ ఆయా ట్రేలో బిస్కెట్లూ, కాఫీ తెచ్చింది. మరి కాసేపటికి మరో అబ్బాయి ఓ దరఖాస్తు ఫారం పట్టుకొచ్చి ఇచ్చాడు –'' '' ఇది నింపి ఇవ్వమన్నారు'' అంటూ.

'' ఆయన ....?'' ఏదో అడగబోయింది.

కొత్త బాబు పిల్లలతో ఆడుకుంటూ ఉంటే చూస్తున్నారు. ఇక్కడ ఆటోలు దొరకవు. మీకు కావాలనుకున్నప్పుడు చెబితే నే పిలుస్తాను ఆయన మీకు సహాయం చెయ్యమని చెప్పారు''

గది బయటకు వెళ్లి బల్లమీద కూచున్నాడు ఆ అబ్బాయి.

**స్వాతి సపరివార పత్రిక**

1-2-91.